ప్రజాశక్తి
బుధవారం 3 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

విఆర్‌ఎస్ నుంచి 1500 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - మక్కువ

మధ్య తరహా సాగునీటి ప్రాజెక్ట్ వెంగళరాయ సాగర్ నుంచి సువర్ణముకి, గోముకి రెగ్యులేటర్ ద్వారా నదుల్లోకి 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రస్తుత తుఫాను కారణంగా మంగళవారం సాయంత్రం నదుల్లో వరద ప్రవాహం పెరగడంతో ప్రాజెక్టుల గేట్లను ఎత్తివేసి నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. కావున నదీ పరివాహక ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

విఆర్‌ఎస్ నుంచి నదిలోకి విడుదలైన వరదనీరు

గ్రానైట్ కంపెనీ నిర్లక్ష్యానికి గిరిజనుడు బలి

- చెరువులో చేపల వేటకు వెళ్లి మృత్యువాత
- బూడిదతో నిండిపోయిన బడిదేవరమ్మ చెరువు
- మృతుని కుటుంబానికి 50లక్షల పరిహారం చెల్లించాలి : ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని గంగాపురం పంచాయతీ పరిధిలోని బడిదేవర కొండపై మైనింగ్ తవ్వకాలు చేస్తున్న గ్రానైట్ కంపెనీ నిర్లక్ష్యానికి ఓ అమాయక గిరిజనుడు బలయ్యాడు. ఆగష్టు 30న చేపల వేటకు వెళ్లిన గిరిజనుడు బంగారిదొర చెరువు ఊబిలో కూరుకుపోయి మృతి చెందాడు. బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాల ప్రదేశానికి సమీపంలోనే బడిదేవరమ్మ చెరువు వుంది. ఈ చెరువులో అనేక ఏళ్లుగా సమీప గ్రామాల గిరిజనులు చేపలు పట్టుకుని జీవిస్తున్నారు. నడిమి ములగ గ్రామానికి చెందిన బంగారిదొరతో సహా నలుగురు గిరిజనులు బడిదేవరమ్మ చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లారు. ముందుగా బంగారిదొర చెరువులోకి దిగడంతో ఆయన చెరువులో ఉన్న మట్టి ఊబిలో కూరుకుపోవడం తో ఊపిరాడక మృతి చెందాడు. మిగిలిన వ్యక్తులు దిగడానికి భయపడి వెంటనే జరిగిన విషయాన్ని పోలీసులకు చేరవేశారు. పోలీసులు చెరువు దగ్గరకు చేరుకుని దాని గట్టు ఒకవైపు తెగ్గొట్టి నీటి బయటకు పంపించారు. చెరువులో గ్రానైట్ బూడిదలో కూరుకు పోయిన బంగారి దొర శవమై కనిపించాడు. దీంతో పోలీసులు దొర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ సంఘటనలో గ్రానైట్ కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాల వల్ల విడుదలైన బూడిద కొండపై నుంచి కిందకి చేరుతూ సమీపంలో ఉన్న చెరువులో పేరుకుపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండ మీద వున్న బూడిదంతా చెరువులోకి చేరడంతో ఊబిలా తయారైంది. ఇది గమనించలేని గిరిజనుడు బంగారిదొర చేపల వేటకు దిగి మృత్యువాత పడ్డాడు. గ్రానైట్ కంపెనీకి సమీపంలో ఉన్న చెరువులో ఏటా గిరిజనులు చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నారు. కొండ చుట్టూ అనేక చెరువులు వున్నాయి. ఈ కొండపై పడిన వర్షపునీరే చెరువుల్లోకి చేరుతుంది. ఆ నీటితోనే రైతులు భూములు సాగు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మైనింగ్ అధికారులు బడిదేవర కొండపై మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇవ్వడమే సరికాదని ఎపి రైతు సంఘంతో సహా అనేక ప్రజాసంఘాలు తప్పుబట్టాయి. కానీ గ్రానైట్ కంపెనీ యాజమాన్యంతో కుమ్మక్కయిన అధికారులు, పాలకులు అనుమతి మంజూరుకు సహకరించారు. అనుమతి మంజూరు చేసిన మైనింగ్ అధికారులు బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాల వల్ల విడుదలైన బూడిద, రాళ్లను ఎక్కడ నిల్వ చేయాలనేది మార్గదర్శకాలు జారీ చేశారు. కానీ కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే గ్రానైట్ బూడిద అధిక మొత్తంలో చెరువులో కి చేరి ఊబిలా తయారైందని స్థానికులు చెబుతున్నారు.

గ్రానైట్ మట్టితోబురదమయమైన బడిదేవరమ్మ చెరువు

ఎమ్మెల్యే ఏం చేస్తారో మరి

కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అకస్మాత్తుగా బడిదేవర కొండపై ప్రత్యక్షమై హడావుడి చేశారు. సమీప గ్రామాల ప్రజలు ఆరాధిస్తున్న బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాల వల్ల సమీపంలో ఉన్న చెరువులు కలుషితమై చేపలు చనిపోతున్నాయని, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని గగ్గోలు పెట్టారు. మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు గ్రానైట్ కంపెనీ యాజమాన్యం తవ్వకాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనే చెరువు లోకి బూడిద చేరింది. ఫలితంగా చేపలు పట్టడానికి వెళ్ళిన గిరిజనుడు బంగారి దొర మృత్యువాత పడ్డాడు. దీనిపై ఎమ్మెల్యే ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొండపై మైనింగ్ తవ్వకాలకు అనుమతి మంజూరు చేసింది. ఏడాదిన్నరగా మౌనం వహించిన ఎమ్మెల్యే అనూహ్యరీతిలో అడ్డం తిరిగి కంపెనీ యాజమాన్యాన్ని బెదిరించారు. కంపెనీ నిర్లక్ష్యం వల్లే మృతి చెందిన గిరిజనుడి కుటుంబానికి ఆయన అండగా నిలబడతారా లేదా అనేది తేలాల్సి ఉంది.

బడిదేవరకొండ గ్రానైట్ లైసెన్స్ రద్దు చేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

మండలంలోని వెలగవలస చెరువును గ్రానైట్ బూడిదతో నింపేసి, గ్రానైట్ కంపెనీ పాడి బంగారిదొరను చంపేసిందని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.చేపల వేటకు వెళ్లిన బంగారి దొరను చంపేసింది చెరువు కాదని, గ్రానైట్ కంపెనేనని వాపోయారు. బడిదేవరకొండను గ్రానైట్ చేయడం వల్ల టన్నులకు టన్నులు రాయి బూడిద వస్తుందని, వర్షాలకు అది నీటితో కిందన ఉన్న చెరువుకు చేరిందని, అది చెరువులో మేట పడిందని ఇది తెలియక చెరువులో దిగిన బంగారి చనిపోయాడని ఇది ముమ్మాటికీ గ్రానైట్ కంపెనీ చేసిన హత్యేనని తేల్చి చెప్పారు. బడిదేవరకొండపై గ్రానైట్ చేయడానికి లైసెన్స్ ఇవ్వడం ముమ్మాటికీ చట్టవిరుద్ధమేనని అందులో గ్రానైట్ ఎక్కడ చేస్తారో, బండలను ఎక్కడ వేస్తారో, వచ్చే వ్యర్థాలు అంటే బూడిద, చిన్నచిన్న రాయి ముక్కలు ఎక్కడ వేస్తారో ఇవన్నీ ప్లానింగ్లో ఉంటాయని ఇలా చెరువుల్లోకి వదిలేయడం తీవ్రమైన నేరమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర మైనింగ్ డిపార్ట్మెంట్ లైసెన్స్ ఇవ్వడం ఒక నేరమైతే వచ్చే వ్యర్థాలు ఎక్కడవేస్తున్నాడో కూడా కళ్ళు మూసుకోవడం మైనింగ్ డిపార్ట్మెంట్ చేసిన ఘోరమైన వైఫల్యమని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో స్పందించి చనిపోయిన బంగారిదొర కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం గ్రానైట్ కంపెనీ ఇవ్వాలని, ఈ కంపెనీపై క్రిమినల్ కేసు నమోదు చేసి యజమానిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రానైట్ అక్రమ లైసెన్స్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి

6న చలో విజయవాడ

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ పిలుపు
- గోడపత్రిక ఆవిష్కరణ
- ఇంజినీరింగ్ కాలేజి నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈనెల 6న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి విద్యార్థులంతా కదలి రావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులతో కలిసి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు తీవ్ర ద్రోహాన్ని తలపెట్టిందని విమర్శించారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించారని, తల్లికి వందనంలో అనేక షరతులు పెట్టి 60 వేలమంది తల్లులను దూరం చేసిందని తెలిపారు. నూతన విద్యా విధానంతో సరళమైన మార్పులు తీసుకొచ్చి విద్యారంగంలో గందరగోళాన్ని సృష్టిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడాల్సిన ప్రభుత్వమే కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందని, ఇది రాజ్యాంగ నిబంధనలకే విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలను అణగదొక్కే జిఒలతో ప్రయత్నం మానుకోవాలని, ప్రతిపక్షంలో ఆ విద్యార్థుల వద్దకే నేటి విద్యాశాఖ మంత్రి వెళ్లి అధికారం కోసం వేడుకొన్నారని గుర్తు చేశారు. కావున, ప్రభుత్వం చిత్తశుద్ధితో స్పందించి పాఠశాల, జూనియర్ కళాశాలల్లో విద్యార్థి సంఘాలకు అనుమతులు రద్దు చేసే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని, పెండింగ్లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజురీయింబర్స్మెంట్ విడుదల చేయాలని, జిఒ 77ను రద్దు చేసి పిజి విద్యార్థులందరికీ ఫీజురీయింబర్స్మెంట్ ఇవ్వాలని, పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం కేంద్రాల్లో పీజీ సెంటర్లు ఏర్పాటు చేయాలని, పార్వతిపురం కేంద్రంలో మెడికల్ కళాశాల నిర్మించాలని, కురుపాంలోని గిరిజన ఇంజినీరింగ్ పనులు పూర్తి చేయాలని, హాస్టల్ విద్యార్థులకు రూ.3వేలు మెస్ బిల్లులు పెంచాలని, హాస్టళ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, ఎయిడెడ్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, యూనివర్శిటీల్లో అధ్యాపక, ఖాళీ విసి పోస్టులు భర్తీ చేయాలని, అర్హులైనవారందరికీ తల్లికి వందనం పథకం రూ.15 వేలు అందించాలని, రాష్ట్రంలో విద్యార్థులందరికీ ఉచిత బస్ పాస్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.అనిల్, టి.అఖిల్, జిల్లా సహాయ కార్యదర్శి బి.గంగారం, జిల్లా కోశాధికారి కే డేవిడ్, జిల్లా ఉపాధ్యక్షులు సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు సురేష్, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: నిర్మాణంలో ఉన్న గిరిజన ఇంజినీరింగ్ కాలేజీని పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహనరావు

గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణ పనులు పూర్తిచేయాలి

కురుపాం : గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులను పూర్తిచేసి గిరిజన విద్యార్థులకు విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎం.రామ్మోహనరావు డిమాండ్ చేశారు. మంగళవారం కురుపాంలో నిర్మాణం జరిగి మధ్యలో ఆగిన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022లో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రూ.123 కోట్లు నిధులతో మంజూరు చేసి శంకుస్థాపన చేసినప్పటికీ నేటికీ సగం పనులు మాత్రమే పూర్తయియ్యాయని తెలిపారు. ఇక్కడ కళాశాలకు కేటాయించిన 43 మంది బోధన, 37 మంది బోధనేతర సిబ్బంది విజయనగరంలో గల జేఎన్టీయూ కాలేజీ నుంచి విద్యను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా గిరిజన విద్యార్థుల పట్ల వైఖరి మాత్రం మారలేదని విమర్శించారు. విద్య శాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేసి గిరిజన విద్యార్థులకు విద్యను అందించకపోతే రానున్న రోజుల్లో గిరిజన విద్యార్థులను కదిలించి పెద్ద పోరాటానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మన్యం జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు బి.అనిల్, ఉపాధ్యక్షులు ఆరిక గంగారావు పాల్గొన్నారు.

రబీకి ప్రణాళికలు సిద్ధం చేయండి : కలెక్టర్

పార్వతీపురం: రబీలో ప్రకృతి వ్యవసాయం సాగుచేసే దిశగా రైతులను ప్రోత్సాహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయంపై సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువులతో ప్రకృతి వ్యవసాయం సాగుచేసేలా రైతులు ఆలోచించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల అధిక రాబడితో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని హితవు పలికారు. అలాగే తక్కువ నీటితో వ్యవసాయం చేసేలా డ్రిప్ ఇరిగేషన్ వినియోగించుకోవాలని సూచించారు. వరితో పాటు లాభదాయకమైన ఉద్యానవన పంటలను వేసుకోవాలని, అవకాశం మేరకు అంతర్ పంటల వైపు మొగ్గు చూపాలని ఉద్బోధించారు. చెరువులను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని, రైతులు కూడా ముందుకు వచ్చి చెరువులు ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో విశేష కషి చేస్తున్న రైతులకు దుస్సాలువతో సత్కరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముఖరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సాగుభూమికి రక్షణ కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస వ ండలంలో గల గెడ్డసింగపురం పంచాయతీ ఏనుగుల గూడలో గిరిజనులు సాగు చేస్తు డి-పట్టా భూమికి రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా గిరిజనులు, పేదలు రెవెన్యూ సర్వేనెంబర్ 189లో సుమారు 40 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నారన్నారు. వరి, పత్తి, మొక్కజొన్న, జీడి, కొండచీపుర్లు వంటి పంటలు పండించుకుంటూ వీరు జీవనం సాగిస్తున్నారన్నారు. ఇందులో గిరిజనులకు 20 మందికి 27 ఎకరాల 33 సెంట్లు భూమిని ప్రభుత్వం డి పట్టాలు మంజూరు చేసిందని, ఈ భూములపైకి వీరఘట్టం మండలం సంత నర్సిపురం గ్రామానికి చెందిన కొంతమంది తమకు పట్టాలు ఉన్నాయని దౌర్జన్యంగా గిరిజనుల సాగు చేస్తున్న భూముల్లోకి వచ్చి జెసిబిలు పెట్టి దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. గిరిజనులపై దౌర్జన్యాలు ఆపాలని వీరఘట్టం మండల తహశీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదులు చేసినా చర్యలు లేకపోవడంతో ప్రతిరోజూ జెసిబిలు తీసుకొచ్చి కొంతమంది పెత్తందారులు దాడి చేస్తున్నారని తెలిపారు. వెంటనే జియ్యమ్మవలస, వీరఘట్టం మండలాల తహశీల్దార్లు, పోలీసు సమగ్ర జాయింట్ సర్వే చేసి గిరిజనుల భూములకు, గిరిజనులు సాగు చేస్తున్న పంటలకు రక్షణ కల్పించి పేదల మధ్య తగాదాలు లేకుండా చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కూరంగి సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గరుగుబిల్లి రాజు, గరుగుబిల్లి దమయంతి, గిరిజన సంఘ నాయకులు మండల రామారావు, ఎల్లారు ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న గిరిజనులు, సిపిఎం నాయకులు

నత్తల నివారణకు చర్యలు చేపట్టాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి -కొమరాడ

మండలంలోని నత్తల నివారణకు ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టి బాధిత రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని గంగరేగువలస, కుమ్మరి గుంట తదితర ప్రాంతాల్లో రైతులు నత్తల సమస్యతో బాధపడుతున్న పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. ముందుగా గంగరెవలసలోని కందుల పాటి సాయిబాబు బొప్పాయి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా నత్తల సమస్య ఎప్పుడు నుంచి ఉంది ఏ మేరకు నష్టం జరిగిందన్న వివరాలను ఆ రైతును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బొప్పాయి, జామ, కూరగాయలు పంటల్లో నత్తలు పెరిగిపోయి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. నత్తల సంతతి పెరిగిపోయి పంటలను తినేసి ధ్వంసం చేస్తున్నా అధికారులు పూర్తి స్థాయిలో వీటి నివారణకు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. దీనివల్ల రైతులు పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. మండలంలోని అధిక శాతం నత్తల సమస్య ఉందని, అన్ని రకాల రైతులు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే నత్తల నివారణకు చర్యలు చేపట్టి నష్టపోయిన పంటలను పరిశీలించి నివేదికలు సిద్ధం చేసి పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నత్తలతో దెబ్బతిన్న బొప్పాయి పంటలను పరిశీలిస్తున్న ఎం. కృష్ణమూర్తి

స్వమిత్వతో కచ్చితమైన భూ రికార్డులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్ (స్వమిత్వ) సర్వేతో కచ్చితమైన భూ రికార్డులను అందించడం జరుగుతుం దని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. దీంతో ప్రజలకు స్పష్టమైన యాజమాన్య రికార్డులతో కచ్చితమైన ఆస్తి యాజమాన్య డేటాను అందుబాటులోకి రానుందని అధికారులకు తెలిపారు. తద్వారా భూ వివాదాలు తగ్గుతాయని, ఈ పథకం ఆస్తుల మోనటైజేషన్‌ను సులభతరం చేయడంలో కూడా సహాయపడుతుందని వివరించారు. మండలంలోని జమదాల పంచాయతీ లక్ష్మిపురంలో అమలవుతున్న స్వమిత్వ యోజన పథకాన్ని కలెక్టర్ సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలను కలెక్టర్ జారీ చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ స్వమిత్వ కింద గ్రామాల్లో మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే, మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసిన పథకమని అన్నారు. ఇది సామాజిక, ఆర్థిక, స్వీయ సాధికారతను ప్రోత్సహించడానికి సర్వే చేయనున్నట్లు చెప్పారు. అంతకుముందు సర్వే ప్రక్రియను, చేపడుతున్న విధానాలను స్వయంగా పరిశీలించి వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

లక్ష్మీపురంలో స్వమిత్వ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఎర్రన్నాయుడు చెరువును పరిశీలించిన కలెక్టర్

ట్రిపుల్ ఆర్ కింద ప్రతిపాదనలు పంపిన జమదాలలోని ఎర్రన్నాయుడు చెరువును కలెక్టర్ పరిశీలించారు. ప్రతిపాదనలో ఉన్న విధంగా మదుములు, చెరువు అభివృద్ధి తదితర పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పర్యటనలో మండల అధికారులు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి అడ్డంగా పడి ఉన్న చెట్లు తొలగింపు

ప్రజాశక్తి - సీతంపేట

గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పొల్ల గ్రామం దరి దోనుబాయి- పొల్ల రహదారికి అడ్డంగా పడిన చెట్లును దోనుబాయి ఎస్సై షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో అడ్డంగా పడి ఉన్న చెట్లను తొలగించారు. వాహనాల రాకపోకలు అనుగుణంగా జంగిల్ క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు తదితరులు ఉన్నారు.

లాటరీ విధానం ద్వారా బార్ కేటాయింపు

పార్వతీపురంటౌన్ : లాటరీ విధానంలో పారదర్శకంగా జిల్లాలో ఒక బార్‌ను కేటాయించినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బార్ కేటాయింపు ప్రక్రియ కలెక్టర్ ఛాంబరులో మంగళవారం జరిగింది. బార్ కేటాయింపు కోసం నాలుగు దరఖాస్తులు అందగా, కలెక్టర్ లాటరీని స్వయంగా తీసి చూపించారు. దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి రూ.20.4 లక్షలు వచ్చినట్లు జిల్లా మద్య నిషేధ, అబ్కారి శాఖాధికారి అయిన బమ్మిడి శ్రీనాథుడు తెలిపారు.

సంక్షేమ పథకాలు అందేలా కృషి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నల్ జగన్నాథ్ ఆదేశించారు. ఆది కర్మయోగిపై రెండు రోజుల శిక్షణా తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆదిమ తెగలకు చైతన్యం కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఆదికర్మ యోగి శిక్షణ కార్యక్రమానికి 32 పంచాయతీల నుంచి కార్యదర్శులు, సిబ్బంది, 14 మంది మండల్ స్థాయి అధికారులు హాజరైనట్లు ఎంపిడిఒ మిస్రో తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర డిప్యూటీ ఎంపిడిఒ కొండపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీల వసతి గృహాన్ని పరిశీలించిన పిఒ

స్థానిక వైటిసిలో నిర్వహిస్తున్న గర్భిణీల వసతి గృహాన్ని ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడున్న గర్భిణీలతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. వసతి గృహంలో ఉన్న గర్భిణీలకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారు సుఖ ప్రసవం జరిగేలా వైద్య సిబ్బంది అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, డిడి అన్నదొర, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిసిసి టెండర్లు నిర్వహణలి

స్థానిక ఐటికె పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, పోస్ట్ మెట్రిక్ వసతి గహాలు, మినీ గురుకులాలకు సంబంధించి నిత్యవసర సరుకులు, విద్యార్థుల కాస్మెటిక్స్ కు సంబంధించిన సరుకులపై జిసిసి ద్వారా టెండర్లను ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సరుకుల సరఫరాలో నాణ్యత లోపించకూడదని, నిర్దేశిత సమయానికి సరుకులు సరఫరా చేయాలని ఆదేశించారు. 42 రకాల వస్తువులకు టెండర్లను నిర్వహించారు. ఈ టెండర్ల కార్యక్రమానికి 11 మంది టెండర్ దారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, డిడి అన్నదొర, జిసిసి డిఎం సంధ్యారాణి, మేనేజర్లు నర్శింహులు, క్రిష్ణ, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -పాలకొండ

పాలకొండలో ఈనెల 13,14 తేదీల్లో జరుగు సిఐటియు జిల్లా 11వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కే గౌరీశ్వరి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పాలకొండ ఎంఎం నగర్‌లో మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల కార్మికవర్గం అనేక సమస్యలు ఎదుర్కొంటుందని, కార్పొరేట్లకు మేలు చేసేందుకు కార్మికుల హక్కులను హరించేందుకు, పని గంటలు పెంచేందుకు ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్ర భాగాన నిలిచిందని తెలిపారు. దేశంలో వివిధ రంగాల కార్మిక సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గ పోరాటాలను నిర్మించేందుకు సిఐటియు అఖిల భారత మహాసభలు దోహదపడతాయని తెలిపారు. ఈ మహాసభలకు ముందు రాష్ట్ర, జిల్లా మహాసభలు నిర్వహించినున్నామని అందులో భాగంగా జిల్లా మహాసభలు ఈనెల 13 ,14 తేదీల్లో పాలకొండలో జరుగుతాయని తెలిపారు. ఈ జిల్లా మహాసభలను పాలకొండ ప్రాంత కార్మిక వర్గం, వర్తక, వాణిజ్య, రాజకీయ ప్రముఖులు సహకరించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి.రాధరాణి, పి.శ్రీదేవి, గౌతమి, శాంతి, కాంతమ్మ, మహేశ్వరి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : పాలకొండలో ఈనెల 13, 14వ తేదీల్లో జరిగే 11వ జిల్లా మహాసభ జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కూనేరు రామభద్రపురం ఆసుపత్రి ప్రాంగణంలో ఆశా వర్కర్లతో కలిసి గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల మండల నాయకులు పార్వతి, రాజేశ్వరితో కలిసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు సుజాత, హేమ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పార్వతి, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

వీరఘట్టం : పాలకొండలో ఈనెల 13,14 తేదీల్లో జరుగు సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా పిలుపునిచ్చారు. మంగళవారం వీరఘట్టం, బిటివాడ ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహాసభలు సందర్భంగా 13న 10 గంటలకు ర్యాలీ ఉంటుందని, ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ప్రసాదరావు, వై ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లామహాసభల కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మికులు, నాయకులు

యూరియా కోసం ఎరువుల దుకాణం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

ఒక్క బస్తా దొరికితే చాలు
యూరియా కోసం రైతుల పాట్లు

ప్రజాశక్తి - పాలకొండ

యూరియా కొరత తీవ్రంగా ఉంది. వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో యూరియా కోసం రైతులు పరుగులు తీస్తున్నారు. పట్టణంలో గాయత్రి నగర్ సమీపంలో ఒక ప్రైవేట్ షాపుకు యూరియాలోడు రావడంతో రైతులు ఆ షాపు ముందు బారులు తీరారు. ఒక్కటే దొరికితే చాలు అన్న పరిస్థితిలో రైతులు ఎదురు చూశారు. 2080 బస్తా వచ్చినప్పటికే ఈ షాపులో రూ.400కు కొనుగోలు చేసే పరిస్థితి దాపురించింది. రైతులు యూరియా కోసం గంటల తరబడి క్యూ లైన్ లో వేచి చూడాల్సిన పరిస్థితి కనిపించింది.

రెండో రోజుకు చేరిన అంగన్వాడీల దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం

అర్హత కలిగిన అంగన్వాడీ హెల్పర్లకు జీవో 2 ప్రకారం వర్కర్లుగా ప్రమోషన్ చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న దీక్షలు మంగళవారానికి రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన గౌరవ అధ్యక్ష కార్యదర్శులు ఎం.ఉమామహేశ్వరి, గంట జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ అధికారులు స్పందించి అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలకు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం పట్టణ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న వీఆర్‌ఎలు

వీఆర్‌ఎలకు పేస్కేల్ అమలు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

వీఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని, పెండింగ్ సమస్య పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ జి.ప్రశాంతికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల వీఆర్‌ఎలకు వీఆర్‌ఓలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, నామినీలకు వీఆర్‌ఎలుగా మార్చేందుకు ప్రభుత్వం ఆదేశాలివ్వాలని, అటెండర్, నైట్ వాచ్ మెన్ ప్రమోషన్ కోటా 20 శాతాన్ని 70 శాతానికి పెంచాలని, అక్రమ డ్యూటీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం వీఆర్‌ఏ సమస్యలపై చర్చించి, పరిష్కారానికి కృషి చేయాలని, లేకుంటే సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్తు పోరాటాలు సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఎలు ఆర్.ఆనంద్, ఎ.చిట్టమ్మ, బంగ గురువులు, ఎక్కు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వం వివిధ రూపాల్లో రాయితీపై అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని, స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో డ్రోన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అతి తక్కువ సమయం ఎక్కువ ఫలితం సాధించే దిశగా అధునాతన శాస్త్రీయ సాంకేతికను అలవర్చుకునే దిశగా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక ఈ వై పథకం కింద వ్యవసాయ శాఖ, డిసిబిలి ప్రభుత్వ సహకారంతో 80శాతం రాయితీతో డ్రోన్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ డ్రోన్‌ను ఎపిఎం అధ్యక్షులు కె.చిన్నమనాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో ఎపిఎం కె.రత్నకుమారి, మండల మహిళా సమైక్య అధ్యక్షులు కె.లలితకుమారి, ఎపిఎం కె.రాము, స్థానిక వ్యవసాయ అధికారి సౌజన్య, ఎఇఓ రాజేష్, ఎల్‌సి వై ఆనంద, రైతు ఉత్పత్తి బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - భామిని

విద్యార్థులు చదువులో బాగా రాణించి, మంచి అవకాశాలు అంది పుచ్చుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు అన్నారు. మండలంలోని పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 10 మంది విద్యార్థులకు ఎయిమ్ అసోసియేషన్ సంస్థ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమోంటోలను అందజేశారు. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీని ఎయిమ్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎయిమ్ వ్యవస్థాపక అధ్యక్షులు మీసాల ప్రఫుల్ కుమార్, కోఆర్డినేటర్ ఆనందరావు, ట్రెజరర్ మాసపు గాంధీ రాజు, దిలీప్ పట్నాయక్, ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం ఉన్నారు

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా లక్ష్మణరావు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని జోగింపేటకు చెందిన టిడిపి నాయకుడు బొమ్మినాయిని లక్ష్మణరావును స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టరుగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు కుటుంబసమేతంగా ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం లక్ష్మణరావు దంపతులను ఎమ్మెల్యే విజయ్ చంద్ర శాలువాతో సత్కరించి అభినందించారు. స్వచ్ఛాంధ్ర డైరెక్టర్‌గా నియమించిన ప్రభుత్వానికి, ఇటు పార్వతీపురం నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని లక్ష్మణరావుకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోలీ క్రాస్ సహకారంతో నెరవేరిన సొంతింటి కల

ప్రజాశక్తి - భామిని

హెూలీ క్రాస్ సంస్థ కడంబసింగిలో నిర్మించిన రెండిళ్లను హెూలీ క్రాస్ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ మంగళవారం ప్రారంభించి, లబ్ధిదారులు లక్ష్మీ, ఎర్రనికి అందజేశారు. హెూలీ క్రాస్ సంస్థ సహకారంతో సొంతింటి కళ నేటికీ నెరవేరిందని కడంబాసింగికి చెందిన మహిళలు లక్ష్మీ, ఎర్రని తెలుపుతూ, హెూలీ క్రాస్ డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులు ఫుల్..రియల్టర్లు నిల్

ప్రజాశక్తి - కురుపాం

అక్రమ రియల్ ఎస్టేట్‌ల క్రమబద్ధీకరణలో భాగంగా బుడా సంస్థ స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అధికారులు బొబ్బిలి నుంచి సకాలంలో సమావేశం నిర్వహించగా రియలెస్టేట్ వ్యాపారులు మాత్రం హాజరు కాలేదు. మంగళవారం కురుపాం మేజర్ పంచాయితీ పరిధిలో ఉన్న రియల్ ఎస్టేట్ వివరాల కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో కుర్చీలు బుడా అధికారులు కూర్చోగా మిగిలిన కుర్చీలు ఖాళీ దర్శనం ఇచ్చాయి. దీంతో అధికారులు ఫుల్-రియాల్టర్లు నిల్ అన్నట్లుగా కొనసాగింది. ఉదయం 11గంటలకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ముందస్తుగా సమాచారం అందుకున్నప్పటికీ వారంతా గైర్హాజరవ్వడం

రియల్టర్లు రాక ఖాళీగా ఉన్న కుర్చీలు

పలుచోట్ల వైఎస్ వర్ధంతి

వైఎస్ విగ్రహానికి పూల వేస్తున్న మాజీఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా పార్వతీపురం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహం వద్ద నియోజకవర్గ పార్టీ నాయకుల సమక్షంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టులు కట్టినా, రైతులకు ఉచిత విద్యుత్ అందించినా వైఎస్‌కే చెల్లిందని, ఆయన వారసత్వాన్ని జగన్ కొనసాగిస్తున్నారని, వైఎస్ తెచ్చిన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పులు తెచ్చాయని కొయాడారు. అనంతరం అనాథశ్రమంలో అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్ చైర్మన్లు యిండుపూరు గుణ్ణేశ్వరరావు, కొండపల్లి రుక్మిణి, పట్టణ మండలాల వైసిపి అధ్యక్షులు, జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అలాగే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో సాలూరు పట్టణం, మామిడిపల్లి, బాగువలస లలో వైఎస్ ఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళిలు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా వైసిపి కార్యదర్శులు దండి శ్రీను, డోల బాబ్జి, వంగపండు అప్పల నాయుడు, గిరి రఘు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం : కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి మండలంలోని తెట్టంగిలో పాలకొండ నియోజకవర్గం వైయస్సార్ యువజన విభాగం అధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు వైఎస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సతివాడ చిన్నంనాయుడు, పొట్నూరు పరిశినాయుడు, అలజంగి ఏలియా, కృష్ణంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక రావాడ కూడలి వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి ఎంపిపి శెట్టి పద్మావతి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లాకు కోప్షన్ సభ్యులు షేక్ నిసార్, వైసిపి జిల్లా అధికారి ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, మండల కోప్షన్ సభ్యులు షేక్ జిలాని, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసిలు వి.బంగారు నాయుడు, టివిఎస్ స్వామియోధులు, రాష్ట్ర మైనార్టీ సంయుక్త కార్యదర్శి షేక్ నూరేళ్ల తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : వైఎస్ వర్ధంతిని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్ , లక్ష్మణరావు, గుమ్మలక్ష్మీపురం ఎల్విన్ పేట, లక్కగూడ సర్పంచులు బి గౌరీ శంకర్రావు, ఆర్ చైతన్య స్రవంతి, సూర్యారావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి యూత్ వింగ్ నిమ్మక గోపాల్ , నాయకులు ఎద్దు మురళి, వహీద్ ఖాన్, కే కిషోర్ తదితరులు ఉన్నారు.

పాలకొండ : వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా కార్గిల్ పాయింట్ దగ్గర ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వి.కళావతి, వైసిపి మండల పార్టీ కన్వీనర్ కె.సూర్యప్రకాష్ పట్టణ పార్టీ అధ్యక్షులు వెలమల మన్మథరావు, దుప్పడ పాపినాయుడు, కె.విజయకుమార్, నెల్లి శివప్రసాద్, కోట అజయ్ తదితరులు ఉన్నారు.

కొమరాడ : మండలంలోని రాజ్యలక్ష్మిపురంలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వైసిపి జిల్లా యువత అధ్యక్షులు నంగి రెడ్డి శరత్‌బాబు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

వైఎస్‌కు నివాళ్లు అర్పిస్తున్న రాజన్నదొర

కార్యక్రమంలో స్థానిక నాయకులు తోరిక సింహాచలం తదితరులు ఉన్నారు.

మక్కువ : స్థానిక వైసిపి కార్యాలయంలో జడ్పిటిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు, మండల వైసిపి అధ్యక్షులు రంగునాయుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాజశేఖరరెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 21 పంచాయతీల నుంచి వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తును పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరిం చుకుని మంగళవారం టిడిపి, జనసేన నాయకుల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె పవన్‌కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శివ, మోహన్, పిల్లా మురళీ, పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఎఎంసి ఛైర్మెన్ ముఖీ సూర్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

వీరఘట్టం : పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తన క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు, జామి లక్ష్మీనారాయణ, ఉదయాన ఉదయభాస్కర్, బల్ల హరిబాబు, చింత ఉమామహేశ్వరరావు, ఎస్.శశికుమార్, జనసేన జానీ, పండు, సాయి పవన్, ఎల్.మురళీకష్ణ, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా భద్రగిరి సిహెచ్‌సిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎల్విన్ పేట కూడలిలో కేక్ కట్ చేశారు. కురుపాం నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావుకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ఎంపికైనందుకు మండల జనసైనికులు ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన అరకు పార్లమెంట్ కార్యదర్శి కొనిస రాజా, నాయకులు అనిల్, జి.అజయ్ కుమార్, సుజిత్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని కురుపాంలో మండల జనసేన అధ్యక్షులు నేరెడుబిల్లి వంశీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్చార్జి కడ్రక మల్లేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక సిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ గార గౌరి, జన సైనికులు శ్రీకర్, అనిల్ కుమార్, ఉపేంద్ర, రాజా, అజయ్, సంకు, ప్రసన్న, రాధాకృష్ణ, సంతోష్, గౌరి, మురళి, సాయి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జయకృష్ణకు కేక్ తినిపిస్తున్న అభిమానులు

సీతంపేట : జనసేన మండల అధ్యక్షులు విశ్వనాథం, జిసిసి డైరెక్టర్ నిమ్మల నిబ్బరం, ఎఎంసి చైర్మన్ బిడ్డిక సంధ్యారాణి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పుట్టినరోజు సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జనసేన కార్యాలయం వద్ద కేక్ కట్ ఏసి పంచిపెట్టారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు కుండంగి శ్రీకాంత్, సవర ప్రసాదరావు, కుమార్, సింహాచలం, కోటి, సంతు, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు వీరఘట్టం రోడ్ లో జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే జయకష్ణ ఆధ్వర్యంలో జరిగాయి. ఎమ్మెల్యే కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో తూర్పు కాపుకార్పొరేషన్ డైరెక్టర్ గర్భాని సత్తిబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె,అప్పలనాయుడు, పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, వాకమూడి అనిల్ సుధా తదితరులున్నారు.

పార్వతీపురం టౌన్ : ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని స్థానిక ఏపీ ఎన్జీవో భవనం వద్ద జనసేన నాయకులు రక్తదాన శిబిరం, కేక్ కటింగ్ అన్నదానం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

కొమరాడ : పవన్ కల్యాణ పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని శివిని వద్ద ఉన్న రాయల్ అకాడమీలో శ్రీ రేణుక ఎడ్యుకేషనల్ సొసైటీ, విస్ డామ్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కటింగ్ చేసి పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీ రేణుక ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ గొట్టాపు రేణుక చేతుల మీదుగా వృద్ధ మహిళలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు.

గరుగుబిల్లిలో సబ్ కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పార్వతీపురం సబ్ కలెక్టర్ డాక్టర్ ఆర్ వైశాలి మండలంలోని పెద్దూరులో గల చౌక ధరల దుకాణాన్ని సందర్శించి, అక్కడ ఉన్న స్టాకును పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసిన ఆమె, ఆ మేరకు సరుకులు ఉన్నదీ, లేనిది గమనించి, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక రెవెన్యూ రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి, ఎరువుల పరిస్థితిని సమీక్షిస్తూ రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్దేశిత ధరల కంటే ఎక్కువ మేరకు విక్రయిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు. రికార్డులు విధిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. స్వమిత్వ బందంతో ఆమె సమీక్షించారు. అందుబాటులో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సేవలు చక్కగా అందించాలని ఆదేశించారు. వర్షాకాలంలో వైద్య సిబ్బంది అందరూ పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి పరిస్థితుల్లోనైనా వైద్య సేవలను అందించుటకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్, ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్ పిహెచ్‌సిని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిఐఒ డాక్టర్ విజయమోహన్ మంగళవారం అకస్మికంగా సందర్శించారు. పిహెచ్‌సిలో జరుగుతున్న ఆశా డే సమావేశంలో పాల్గొని పిల్లలకు రోగనిరోధక శక్తి ఇమినేషన్ షెడ్యూల్, మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ కార్డులు వాడకం, గర్భిణీ స్త్రీల రిజిస్ట్రేషన్ ఎఎన్ఎంల సేవలు మొదటి త్రైమాసికం, అధిక రిస్క్ రిజిస్ట్రేషన్లు, పిల్లల రిజిస్ట్రేషన్లు, పూర్తి రోగనిరోధక గురించి గ్రామాల్లో వారు అందిస్తున్న సేవలపై సమీక్షించారు. అనంతరం ల్యాబ్ గదిని సందర్శించి రక్త పరీక్షలు వివరాలు మలేరియా కేసులు గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఫార్మాసీలో అన్ని మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్య అధికారి బుద్దేశ్వరరావు, ఇఒ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలో గకురుస్తున్న వర్షాలకు జ్వరాలు సోకే అవకాశాలు ఉన్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకోవాలని వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తరచుగా గ్రామాలను సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవాలన్నారు. గర్భిణీలకు, బాలింతలకు అంగన్వాడి కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ప్రసవాలు ప్రభుత్వాసుపత్రిలో జరిగేలా చూడాలన్నారు. ప్రతి నెల 9న ఆరోగ్య కేంద్రంలో నిర్వహించు పిఎంఎస్‌వై కార్యక్రమానికి వైద్య తనిఖీల కోసం గర్భిణులను తీసుకురావాలన్నారు. బిటివాడ పిహెచ్‌సిలో వైద్యాధికారి ఎ.మానస ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఒ.శాంతకుమారి, శుభారతమని, ఆదిలక్ష్మి, లలిత కుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజిపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని సత్య సాయి సేవా సమితి కన్వీనర్ వెలిది సుబ్బారావు ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయనగరానికి చెందిన సాయి సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ అధినేత డాక్టర్ అక్కేన శ్రీరామమూర్తి, వైద్య బృందం రోగులకు ఉచితంగా తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్యశిబిరంలో పెదపెంకికి చెందిన ఈర్ల సంజీవ్ నాయుడు, చిలకలపల్లికి చెందిన సాయి భక్తులు రంగు ముద్రి వాసు, క్యాంపు కో ఆర్డినేటర్ రవి తదితరులు పాల్గొన్నారు

వట్టిగెడ్డకు వరద పోటు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న వట్టిగెడ్డకు ఒక్కసారిగా వరద పోటు వచ్చింది. సోమవారం కురిసిన భారీ వర్షానికి గెడ్డలోకి నీరు చేరింది. నిన్నటి వరకు చుక్క నీరు కూడా గెడ్డ లేకపోవడంతో కురిసిన వర్షానికి ఒక్కసారిగా నీటి ప్రవాహం అధికంగా కావడంతో గెడ్డ సమీపంలో ఉన్న కాలనీవాసులు భయముందోళనకు గురవుతున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండ

భవన నిర్మాణ రంగంలో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు, ఎపి భవన నిర్మాణ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు దావాలా రమణారావు, మండల అధ్యక్షులు మజ్జి వీరంనాయుడు ప్రధాన కార్యదర్శి అర్ధముడి లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల డిటి ఎంఎస్‌వి ప్రసాద్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పెండింగ్లో ఉన్న వివిధ రకాల క్లైమ్లను కార్మికుల చెల్లించాలని కోరారు. నిర్మాణ పనుల నుంచి వసూలు చేసిన సెస్ నిధులను సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, భవన నిర్మాణ కార్మిక పిల్లలకు స్కాలర్షిప్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో నిర్మాణ రంగ కార్మికులు అమలు చేస్తున్న భద్రతను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు పాలకొండ సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భవన నిర్మాణ కార్మిక సమస్యలు పరిష్కరిస్తామని ఆదుకుంటామని హామీ ఇచ్చి నేటికీ 17 నెలలు పూర్తయిందని, అయినా భవనిర్మాణ కార్మిక సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను భవనిర్మాణ కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎస్.నారాయణరావు, ఎం.రమేష్, పి.రమణ, ఎస్.మోహన్‌రావు, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వీరఘట్టం : భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును ప్రభుత్వం తక్షణమే పునర్ధించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరఘట్టం, నడుకూరు గ్రామా భవన నిర్మాణ కార్మికులతో కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమం పథకాలు ఒక్క కేరళ రాష్ట్రం తప్ప మిగిలిన ఏ రాష్ట్రంలో కూడా అరకొరగానే అమలు చేస్తున్నాయని విమర్శించారు. మెమో 12 34 రద్దుచేసి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 8న పార్వతీపురం సుందరయ్య భవనంలో జరుగు జిల్లా సదస్సుకు భవన నిర్మాణ కార్మికులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.ప్రసాదరావు, బి.రాము, అప్పలనాయుడు, పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఇప్పలవలసలో జరుగుతున్న స్వమిత్వ సర్వేను మండల స్థాయి అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉండే వివిధ రకాల ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ స్థలాల కొలతలపై ఆయన పరిశీలించి ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం ఒక ఇంటి పొడవు, వెడల్పులు బట్టి దాని విలువ సర్వే ద్వారా నిర్ణయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.ప్రసన్నకుమార్, ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ కెకె వర్మ, పంచాయతీ కార్యదర్శి స్వాతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చందన, సర్వేయర్ భాను, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామమంతా ఒక్కటై శివాలయం అభివృద్ధికి కృషి చేయడం హర్షించ దగ్గ విషయమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక కైలాసనాథ ఆలయ స్లాబ్ నిర్మాణానికి మంగళవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రానున్న కార్తీక మాసాన్ని దృష్టిలో ఉంచుకొని ఆలయ నిర్మాణ పనులు పూర్తిచేసి భక్తులకు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి గౌరీ శంకర్రావు, జడ్పీహెచ్ఎస్ స్కూల్ కమిటీ చైర్మన్ సొంటేన రాజేష్, ఆలయ కమిటీ పెద్దలు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయ సాగులో తక్కువ పెట్టుబడితో పలు పంటలతో పలు లాభాలు పొందవచ్చని రైతు సాధికార సంస్థ కన్సల్టెంట్ ప్రవీణ్ కుమార్ అన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన బయో రీసెర్చ్ సెంటర్ (బిఆర్‌సి) యజమానులకు పలు పంటలు క్షేత్ర సందర్శన,కషాయాలు, వృద్ధి ద్రావణాల గురించి శిక్షణ ఇచ్చారు. జియమ్మ వలస మండలం నిడగల్లుగూడలో రైతు బిడ్డిక కించయ్య జీడి మామిడిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ 43 రకాల పంటలు వేసుకుని నిరంతరం ఆదాయం పొందవచ్చన్నారు.తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడులు సాధించడం జరుగుతుందని, 365 రోజులు పలు రకాల పంటలతో భూమిని కప్పి ఉంచే విధానం వల్ల కుటుంబ ఆహార భద్రత సాధించడంతో పాటు ఆదాయం కూడా వస్తుందని వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ మన్మోహన్, శిక్షకులు సిహెచ్ రవికుమార్, బి.కిరణ్, ఎన్ఎఫ్ఎ జి.అన్న పూర్ణ తదితరులు ఉన్నారు.

సచివాలయ సర్వేయర్ ఆత్మహత్య

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో దేవనాపురం సచివాలయం కొత్తకోట పంచాయతీ ఓంబరెల్లికి చెందిన సవర బలరాం (31) జీడి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వై.అమ్మనరావు తెలిపారు. బలరాం భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు వివరాలిలా ఉన్నాయి. బలరాం బత్తిలి సచివాలయం-1 సర్వేయర్ పని చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల మనస్థాపన చెంది ఉరివేసుకొని చనిపోయారని ఫిర్యాదు చేశారు. ఆయనకు ఇద్దరు కుమార్తె ఉన్నారు. బలరాం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి..

గోపాలపురం గెడ్డలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని గోపాలపురంలో గెడ్డలోపడి కె.రమేష్ (42) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. పాలకొండ పట్టణ కొండ వీధికి చెందిన రమేష్ మత్స్యకారుడు. ఎప్పట్లాగే చేపల వేటకు వెళ్లి నీటి ప్రహానికి కొట్టుకుపోయి మృతి చెందాడు. స్థానికులు ఒడ్డుకు చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రమేష్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

స్వయం వ్యాపార రంగంలో రాణించాలి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థులు స్వయం వ్యాపార రంగంలో మెలకువలు తెలుసుకుని రాణించాలని ఉద్యాన కళాశాల అధ్యాపకులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ హిమబిందు సూచించారు. మంగళవారం కురుపాంలో గల పామాయిల్ ఫ్యాక్టరీని డాక్టర్‌వైయస్సార్ ఉద్యాన కళాశాల విద్యార్థులు సందర్శించారు. పామాయిల్లో ముడిసరుకు, తయారీ విధానం, అమ్మకంలో లాభనష్టాలను ఫ్యాక్టరీ సిబ్బంది విద్యార్థులకు వివరించగా, సమాచారాన్ని సేకరించి, తమ పుస్తకాల్లో రాసుకున్నారు. అనంతరం రస్తాకుంటుబాయి కెవికెను సందర్శించారు. కృషి విజ్ఞానకేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు, సాంకేతిక విధానాలపై శాస్త్రవేత్తలు డాక్టర్ స్రవంతి, డాక్టర్ అనంతవిహారి విద్యార్థులకు అవగాహన కల్పించి, కెవికెలో ఏర్పాటు చేసిన డెమో యూనిట్లును చూపించారు.

ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలి : సిపిఐ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని మన్యం జిల్లా సిపిఐ కార్యదర్శి కోరంగి మన్మధరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైటిసిలో మండల అధ్యక్షులు పువ్వల ప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రధానంగా మైదాన ప్రాంతంలో గిరిజనులకు ఇళ్ల స్థలాల విషయమై స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి వివరించినట్టు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయో రెవెన్యూ అధికారులను అడిగి వాటిని గుర్తించినట్టు తెలిపారు. గతంలో ఓ ఇద్దరు వ్యక్తుల వల్ల కొంత మేరకు పార్టీకి నష్టం కలిగించే దిశగా గిరిజనులను మోసగించారని, వారిని పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. భవిష్యత్తులో సమస్యలపై పోరాటం చేసేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు ఇవి నాయుడు, బి.అప్పలనాయుడు, ఆర్ఎస్ కుమార్, నీలమ్మ , సింహాద్రి దుర్గారావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీసాయిరాం డిగ్రీ కళాశాలలో జరగబోయే జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో జాబ్ మేళాకు సంబంధించిన గోడ పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదో తరగతి నుంచి పిజి వరకు చదివిన యువతీ యువకులు ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, శ్రీ సాయి రామ్ డిగ్రీ కళాశాల కరెస్పాండంట్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై పాలకులకు చిత్తశుద్ధి లేదు

పార్వతీపురం టౌన్ : పట్టణ ప్రజల తాగునీటి సమస్యపై ఇటు పాలకులకు, అటు అధికారులు గానీ చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ నాయకులు ఏద్దేవా చేశారు. మున్సిపాలిటీకి తాగునీరు అందించే తోటపల్లి వద్ద గల నాగావళి నది హెడ్ వాటర్ వర్క్స్ ను, నీరు తోడే మోటార్లను, మూలన పడిన జనరేటర్ ను, నీటి సంపులను, నదిలోని ఇన్ఫిల్ట్రేషన్ బావులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు అక్కడ ఉన్న నిర్వాహకులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మున్సిపాలిటీ తాగునీరు అందించే పద్ధతి చూస్తుంటే అధికారుల్లో పాలకుల్లో చిత్తశుద్ధి కొరవడినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. కరెంటు సక్రమంగా సరఫరా లేకపోవడం, ఉన్న జనరేటర్ పనిచేయడంలేదని, తెలిపారు. పాలకులు పట్టించుకోకపోవడంతో అధికారులు పనిచేసే పరిస్థితి లేదన్నారు. దీంతో పట్టణ ప్రజలకు సక్రమంగా తాగునీరందకపోవడంతో ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్లకు తమ సంపాదనలో కొంత ఖర్చు పెట్టే దుస్థితి నెలకొందన్నారు. నీరు ఇవ్వకపోయినా కుళాయి బిల్లులు మాత్రం ముక్కు పిండి వసూలు చేయడం జరుగుతోందన్నారు. గ్రేడ్ వన్ మున్సిపాలిటీకి కమిషనర్ లేకపోవడం చూస్తుంటే ఉన్నతాధికారుల, పాలకుల అసమర్థత కనిపిస్తోందని విమర్శించారు.